క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వైశాఖమాసం రెండవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచితరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు ఉచిత ఖత్నా శిబిరం

బద్వేలు అర్బన్ : బద్వేలు ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఫాతిమా మసీదు గ్రౌండ్ ఆవరణలో ఉచిత ఖత్నా (ఒడుగులు) శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు షేక్ఉమర్, షేక్నూరుల్లాబాష, షేక్షంషీర్తాజ్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం బాలలు ఉన్న కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఖత్నా చేయించుకున్న పిల్లలకు మందులు కూడా పంపిణీ చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8639749382, 9642178300, 8555800820 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అన్నదానం



నిత్యావసర సరుకులు అందిస్తున్న లక్ష్మీదేవి, సుధామణి

ప్రొద్దుటూరు : స్థానిక మదర్ థెరిసా సేవా వృద్ధాశ్రమంలో శనివారం అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ జిల్లా జనరల్ సెక్రటరీ సుధామణి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం సాతుపల్లి గ్రామానికి చెందిన నేతగాని చెన్నయ్య 9వ వర్ధంతి సందర్భంగా ఆయన పెద్దకుమారుడు బాలచంద్ర అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అలాగే పట్టణంలో నలుగురు నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాతృదేవోభవ అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాలస్వామి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డులో గల గుప్తానగర్కు చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు గొల్లపల్లి బాలస్వామి(75) శనివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అకస్మాత్తుగా మృతి చెందడంతో వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి, మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డి.. బాలస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు పోలిరెడ్డి, రామచంద్ర, లక్ష్మిరెడ్డి, ప్రతాప్, ప్రసాద్, రాజశేఖర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కీడలపై శిక్షణ



ఖోఖోలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్లో బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు ఖోఖో, క్యారమ్స్, జిరాఫీచెస్ ఆటల్లో శిక్షణ ఇచ్చారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం విద్యార్థులకు పద్యపఠనం, ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి నీతి కథలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రంసాహెబ్, గంగాధర్రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణోత్సవం





అచలానందస్వామి ఆశ్రమంలో శ్రీ గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, తిలకిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. గుడి ఉత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. అమ్మవారిని పీఠంపై అధిష్టింపజేసి, ఊరేగింపు చేపట్టారు. విజయవాడకు చెందిన మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి నిత్యాన్నదాన విశ్వబ్రాహ్మణ సేవా సమాజం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం నైవేద్యం, మంత్రపుష్ప, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవానికి చిన్నమఠం మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ బీవీ జగన్మోహన్రెడ్డి ఏర్పాట్లు చేశారు.

లింగాలదిన్నె భక్తుల సేవ

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా బ్రహ్మ రథోత్సవం శుభ్రత బాధ్యతను మండలంలోని లింగాలదిన్నెపల్లె భక్తుడు ఎల్.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన భక్తులు మూడు రోజుల పాటు నిర్వర్తించారు. రథోత్సవం రోజు కూడా కీలకంగా వ్యవహరించారు.

అచలానందస్వామి ఆశ్రమంలో..

తోట్లపల్లిలోని అచలానందస్వామి ఆశ్రమంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ, కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 14 నుంచి 19 వరకు ఆరు రోజుల పాటు ఉత్సవాలు చేపడుతున్నారు. శనివారం శ్రీ గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వాముల వారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎంపీపీ వీరనారాయణారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలు ఉత్సాహ భరితంగా జరిగాయి. ఈ కార్యక్రమాలను సద్గురు అచలానందస్వామి ఆశీస్సులతో పీఠాధిపతులు శ్రీ విరజానందస్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాములను దర్శించుకుని తరించారు.



రథానికి పూజ చేస్తున్న పూర్వపు మఠాధిపతి కుమారులు

ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, శాంతిహోమాలు వేదపండితుల ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలోని మండపంలో ఆశీనులను చేశారు. సుముహూర్తంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రామేశ్వరం పురవీధుల్లో మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. కాగా ఆదివారం ఉదయం 9 గంటలకు సత్యనారాయణ వ్రతం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరగనుందని, కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.



రథంలో కొలువు దీరిన స్వామి, అమ్మవారు



రథానికి పూజ చేస్తున్న శ్రీ ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి



ప్రొద్దుటూరులో స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు

ప్రొద్దుటూరు క్రైం : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. వన్టౌన్ పోలీస్స్టేషన్లో శనివారం ట్రబుల్ మాంగర్స్కు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ప్రొద్దుటూరులో రాజకీయ పార్టీ నాయకులు గానీ, వారి అనుచరులు గానీ అనవసరంగా గొడవ పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు. పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించే వారిలో అన్ని పార్టీలకు చెందిన వారు ఉంటారని, ఏ ఒక్క పార్టీకి చెందిన వారు ఉండరన్నారు. ప్రొద్దుటూరులో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, కౌంటింగ్ పూర్తి అయ్యేంత వరకు పోలీసుల చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఘర్షణలు తలెత్తకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నామని డీఎస్పీ పేర్కొన్నారు. కౌంటింగ్ ముగిసే వరకు ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, వారి కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. ఏ ప్రాంతంలో అయినా గొడవలు జరిగే అవకాశం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు డీఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో వన్టౌన్ సీఐ శ్రీకాంత్, త్రీ టౌన్ సీఐ వెంకటరమణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీసు అధికారులు, సిబ్బందికి డీఎస్పీ ప్రశంస

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడం పట్ల డీఎస్పీ హర్షం వ్యక్తం చేశారు. తనతో పాటు సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు రేయింబవళ్లు కష్టపడటం వల్ల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. ప్రొద్దుటూరు సబ్డివిజన్లో ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటన కూడా జరగలేదన్నారు. ఇందులో ప్రతి ఒక్కరి కృషి ఉందని డీఎస్పీ ప్రశంసించారు. కౌంటింగ్ ముగిసే వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలని డీఎస్పీ తెలిపారు.



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

గొడవలకు పాల్పడితే కేసులు నమోదు



రాజుపాళెం ఎస్ఐ తులసీ నాగప్రసాద్

రాజుపాళెం : ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, మండలంలోని గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పి.తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఆయన రాజుపాళెంలోని పోలీస్స్టేషన్లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించి ఘర్షణలకు ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. ఇదివరకే ఆయా పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించి గొడవలు, అల్లర్లకు పాల్పడవద్దని చెప్పామన్నారు. రాజకీయ పార్టీ నాయకులు, ఆయా గ్రామ ప్రజల సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలను పూర్తి చేశామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి నాయకులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : ఎన్నికల పోలింగ్ సందర్భంగా అల్లర్లకు దిగి దాడులు చేసి, ఆస్తుల నష్టానికి, వ్యక్తుల గాయాలకు కారణమయిన రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఆర్ ఆర్డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు కూటమి ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ ఎక్కడ అధికారులను మార్చిందో అక్కడే ఘర్షణలు తలెత్తాయన్నారు. దీనికి ఈసీ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. పల్నాడు, ప్రకాశం, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిళ్లకు లొంగి వారికి అనుకూలమైన అధికారులను నియమించడంతోనే విధ్వంసం జరిగిందన్నారు. దీనిపై విచారణకు నియమించిన సిట్ అధికారులు క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

ఘనంగా వాసవిమాత జయంతి

కలసపాడు : స్థానిక అమ్మవారిశాలలో శనివారం వాసవిమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, నగరేశ్వర స్వామి, వాసవిమాతకు అభిషేకాలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆర్యవైశ్య మహిళలచే సామూహిక లక్ష కుంకుమార్చన, పూజలు, భజనలు, గుడి ఉత్సవం, పవళింపుసేవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు మలిపెద్దునాగరాజు, భవనాశిపూర్ణచంద్రరావు, జె.నారాయణ, టి.సత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

మున్సిపాలిటీలో 76.11 శాతం పోలింగ్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,48,4038 ఓట్లు ఉన్నాయి. ఇందులో రాజుపాళెం మండలానికి సంబంధించిన 33 పోలింగ్ బూతుల్లో 25,090 ఓట్లు ఉండగా 22,868 ఓట్లు పోల్ అయ్యాయి. పోలింగ్ శాతం 91.14గా నమోదైంది. ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి 85,069 ఓట్లు ఉండగా 69,608 ఓట్లు పోల్ అయ్యాయి. 81.34 శాతం పోలింగ్ నమోదైంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 1,37,779 ఓట్లు ఉండగా 1.04,873 ఓట్లు పోల్ అయ్యాయి. పట్టణ పరిధిలో పోలింగ్ శాతం 76.11గా నమోదైంది. 60 నుంచి 80 శాతం వరకు ఎక్కువగా పట్టణంలో ఆయా పోలింగ్ స్టేషన్లలో ఓట్లు పోల్ అయ్యాయి.



ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

ప్రాణదాత సేవా సమితికి వితరణ

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి జ్ఞాపకార్థం ప్రాణదాత సేవా సమితి వారికి అన్నదాన కార్యక్రమం కోసం ఓమిని వ్యాన్కు డాక్టర్ ఎంవీఆర్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు తరపున రూ.1.50 లక్షల చెక్కును శనివారం ఎంవీఆర్ కుమారుడు మల్లెల మురళీధర్రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ప్రాణదాత సేవా సమితి సభ్యులు ఎంవీఆర్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, భీముడు, రామకృష్ణ, సుబ్బయ్య, కానపల్లె సూరి, సుబ్బారెడ్డి, చిన్న, నటరాజ్, బయన్న తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న మల్లెల మురళీధర్రెడ్డి

జాబ్మేళాలో 24 మంది విద్యార్థులు ఎంపిక



విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం జరిగిన జాబ్మేళాలో 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవికుమార్ తెలిపారు. వైఎస్సార్ ఈఎసీ కొప్పర్తిలోని ఆల్ డిక్షన్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారు జాబ్మేళ నిర్వహించారు. ఇందులో కళాశాల నుంచి 26 మంది విద్యార్థులు, 31 మంది విద్యార్థినులు హాజరయ్యారు. వీరిలో 19 మంది విద్యార్థులు, 5 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ కె.ప్రహల్లాద్, ఎస్.వంశీకిషోర్, వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వరరెడ్డి, ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ సీ రామోహన్రెడ్డిలు పాల్గొన్నారు.

లోక్అదాలత్లో కేసులు పరిష్కారం

ముద్దనూరు: కేసుల పరిష్కారం కోసం నిర్వహించే లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ భార్గవి సూచించారు. శనివారం మండలంలోని ఓబుళాపురంలో న్యాయమూర్తి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడుతూ రాబోయే లోక్ అదాలత్లో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎస్ఐ మైనుద్దీన్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి

అర్హులకు పట్టాలు ఇస్తాం

పోరుమామిళ్ల : రంగసముద్రం ప్రభుత్వ రెవెన్యూ పొలం 1008/2ఎలో గుడిసెలు వేసుకుని తిరుపతి రెడ్డి కాలనీగా పేరు పెట్టుకొని నివాసముంటున్న వారిని శనివారం ఆర్డీఓ ఆకుల వెంకటరమణ, తహసీల్దారు శిరీష ఆకస్మికంగా తనిఖీ చేశారు. 13 ఏళ్ల క్రితం సీపీఐ ఆధ్వర్యంలో ఆ పొలంలో దాదాపు రెండు వందల మంది గుడిసెలు వేసుకున్నారు. అక్కడే నివాసముంటూ తమకు ఇక్కడ ఇంటి పట్టాలు ఇవ్వాలని వచ్చిన అధికారులందరికీ దరఖాస్తులు ఇచ్చుకున్నారు. ఉద్యమాలు, ధర్నాలు, ఆందోళనలు, ర్యాలీలు చేశారు. గుడిసెల స్థానంలో రేకుల షెడ్లు నిర్మించుకున్నారు. గతంలో అధికారులు కాలనీ సందర్శించినా, ఇంత వరకు వారికి పట్టాలు ఇవ్వలేదు. శనివారం హఠాత్తుగా అధికారులు రావడంతో అక్కడున్న కాలనీ వాసులు తమ గోడును చెప్పుకొన్నారు. కాలనీవాసుల వివరణ తీసుకున్న ఆర్డీఓ అర్హత ఉన్న వారందరికీ పట్టా ఇస్తామన్నారు. రేపు రెవెన్యూ సిబ్బంది వస్తారని, మీ దగ్గరున్న ఓటర్ కార్డు, ఆధార్ కార్డు తదితర ఆధారాలు చూపాలన్నారు. దళారులకు డబ్బులు ఇవ్వవద్దని ప్రభుత్వం పట్టా ఇస్తుందన్నారు.



తిరుపతిరెడ్డి కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

గోపవరం : ప్రస్తుత సీజన్ను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. శనివారం మండలంలోని సాయికృష్ణ ట్రేడర్స్ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. లైసెన్స్ గడువు, స్టాకు రిజిస్టర్, గోడౌన్లో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఇన్వాయిస్, వేబిల్స్ను క్షుణ్ణంగా పరిశీలించారు. చట్టబద్ధత వ్యాపారం చేయాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డు పట్టికలో వివరాలు, ధరలు తెలియపరచాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. గడువు ముగిసిన పురుగు మందులను ఎట్టిపరిస్థితుల్లో విక్రయించరాదని ఆదేశించారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత డీలర్లపై ఉందని పేర్కొన్నారు.



ఎరువుల స్టాకు వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

వైభవంగా బాల పోలేరమ్మ జాతర



విశేష అలంకారంలో బాల పోలేరమ్మ



అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి

కడప కల్చరల్ : కడప నగరం చిన్నబెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ జాతర శనివారం ప్రారంభమైంది. ఇందులోభాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తికి పంచామృతం, పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని కనుల పండువగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయంతోపాటు ఆ ప్రాంగణాన్ని జాతర వాతావరణం ఉట్టిపడేలా వేప మండలతో అలంకరించారు. స్థానిక భక్తులు ఇళ్ల వద్దనుంచి చల్లకుండలతో మేళతాళాలతో ఊరేగింపుగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి చల్ల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆ చల్లనే అమ్మవారి ప్రసాదంగా భక్తితో స్వీకరించారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని మొక్కుకున్నారు. సమీప వీధుల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పచ్చిరొట్ట విత్తనాలు మంజూరు

అట్లూరు : భూములలో సారవంతం పెంచుకునేందుకు 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించిన 55 క్వింటాళ్ల జీలుగలు, 20 క్వింటాళ్ల జనుములు మంజూరు అయినట్లు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య తెలిపారు. జీలగలు గానీ జనుములు గానీ 10 కిలోలు రూ.880లు కాగా ప్రభుత్వం రూ.440 సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు 10 కిలోలకు రైతు వాటా రూ.440లతోపాటు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఒక ఎకరానికి 10 కిలోల చొప్పున గరిష్ఠంగా ఒక రైతుకు 50 కిలోలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

సబ్సిడీ ద్వారా..

గోపవరం : ఖరీఫ్ సీజన్కు సంబంధించి భూముల సారవంతం కోసం 50 శాతం సబ్సిడీతో మండలానికి 51 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మంజూరైనట్లు ఇన్చార్జి ఏఓ రామక్రిష్ణయ్య తెలిపారు. సబ్సిడీ విత్తనాలు అవసరమైన రైతులు ముందుగా ఆయా రైతుభరోసా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుని డబ్బులు చెల్లించాలన్నారు. ఆ తర్వాతనే రైతులకు విత్తనాలను అందజేయడం జరుగుతుందన్నారు. జీలుగలు 10 కేజీలు సబ్సిడీ పోను రూ.440లు, జనుములు 10 కేజీలు సబ్సిడీ పోను రూ.440లు రైతు వాటాగా చెల్లించాలన్నారు. భూమిని బట్టి గరిష్ఠంగా 50 కేజీల వరకు రైతులకు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

క్యూస్పైడర్స్కు ఎంపిక

ప్రొద్దుటూరు : బెంగళూరుకు చెందిన క్యూస్పైడర్స్ సంస్థ శుక్రవారం నిర్వహించిన ఆన్ క్యాంపస్లో స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజీ బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న 19 మంది విద్యార్థులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలకు ఎంపికై నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3 లక్షల ప్యాకేజీ అందిస్తామని సంస్థ క్యాంపస్ హెచ్ఆర్ మేనేజర్ హేమలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ జి.హుస్సేన్రెడ్డి మాట్లాడుతూ 2023–24 ఏడాదికి 100 శాతం ప్లేస్మెంట్ అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. విద్యార్థులు మరెన్నో ఉపాధి అవకాశాలు పొందేలా కృషి చేస్తామన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, హెచ్ఓడీలు, ప్లేస్మెంట్ ఆఫీసర్ పీఎం నసీర్ హుస్సేన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రజనికాంత్రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

నేడు వైద్య శిబిరం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్రోడ్డులోని బంగారుశీనయ్య హాస్పిటల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు బంగారుశీనయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత వైద్యశిబిరం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతందని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.